క్లుప్తంగా

శివాలయంలో ఆషాఢమాస పూజలు

పెనగలూరు : మండల కేంద్రంలోని శివాలయంలో నైనాదీశ్వరుడు, కామాక్షమ్మ మూల విరాట్‌లకు శుక్రవారం ఆషాఢ మాసం పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం తొలి శుక్రవారం కావడంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ పూజారులు రామలింగయ్య స్వామి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ చైర్మన్ జిలకర సుబ్బయ్యలు తెలిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు.

అయ్యప్పకు పూజలు

రాజంపేట రూరల్ : అయ్యప్పస్వామికి ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని అభిషేకాలు, ప్రత్యేక పూజలతోపాటు పల్లకీ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ శివార్లలోని మణికంఠనగర్‌లో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపెంట పాలప్రకాష్, రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన గురుస్వామి కొండా సత్యనారాయణ శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీ సేవను చేశారు.

అలుగును కబ్జా నుంచి కాపాడండి

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురం సమీపంలో ఈర్లకుంట మరవకాలవను వడ్డేపల్లికి చెందిన రౌతు వెంకటయ్య ఆయన కుమారుడు వెంకటస్వాములు కలిసి వంకను పూడ్చారని సుగాలిబిడికి చెందిన ఆయకట్టు రైతులు మూడే కృష్ణనాయక్, బుక్కే గోపీనాయక్‌లు శుక్రవారం రామాపురం తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈర్లకుంట కిందసాగు చేయు ఆయకట్టుదారుల భూముల సర్వేనెంబర్ 727,728లలో మరి కొంతమంది రైతులకు సంబంధించి భూములు ఉన్నాయని ఫిర్యాదులు తెలిపారు. ఈర్లకుంట చెరువు నిండితే ఈ అలుగు ద్వారా నీలకంఠ్రావుపేట చెరువుకు వంక ద్వారా నీరు పోతాయని, ఈ వంకను వడ్డేపల్లి గ్రామానికి చెందిన కొందరూ పూడ్చి కబ్జా చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని అలుగు కాలవను కబ్జా కాకుండా చూడాలని స్థానికులు తహసీల్దార్‌ను కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా ఈ అలుగు, కాలువను పరిశీలించడానికి స్థానిక వీఆర్‌ఓ సాగర్, ఆర్ఐ రవి కుమార్‌లను పరిశీలించి నివేదికను పంపాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

నిర్మాణదశలో ఉన్న గృహాలను పూర్తి చేయాలి

పుల్లంపేట : నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న గృహాలను త్వరగా పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ మహేష్ తెలియజేశారు. శుక్రవారం హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఎంపీడీఓలు సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న లేఔట్స్, గృహనిర్మాణం, తాగు నీరు, డ్రైయిన్స్, పవర్ సప్లయి వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే లబ్ధిదారులను మోటివేట్ చేసి ఇంటి నిర్మాణాలను పూర్తి చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ దినేష్, అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

గాలివీడు : మండల కేంద్రంలోని గౌతమ్ పాఠశాల విద్యార్థిని జి.మౌనిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం సైజు థామస్, షింటో ఇమ్మానుయేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి ఫలితాల్లో మౌనిక 592 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అంతేగాక ఇటీవల విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు బృందం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని అభినందించారు.

ఎంపికైన కొత్తమాధవరం విద్యార్థి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొత్తమాధవరం గ్రామంలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చదివి 574 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన రెడ్డయ్య అనే విద్యార్థి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం పట్ల శుక్రవారం రెడ్డయ్యకు కొత్తమాధవరం జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


భూసార పరీక్షలతో లాభాలు

లక్కిరెడ్డిపల్లె : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంపూర్ణత అభియాన్ యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని రాచపల్లి గ్రామంలో రైతు ముప్పాల ఆనందరాజు పంట పొలం సర్వే నెంబరు – 646లోని రెండు ఎకరాల విస్తీర్ణంలో భూసార పరీక్షా నిమిత్తం మట్టి నమూనాను సేకరించడం జరిగింది. సేకరించిన మట్టిని ప్యాక్ చేసి ప్రయోగశాలకు పంపారు. ఈ భూసార పరీక్షలు చేయడం ద్వారా జరిగే లాభాలను రైతులకు వివరించారు. మండలం నీతి అయోగ్ అధికారి వెంకటరామిరెడ్డి, వ్యవసాయ అధికారులు జయరాణి, కెరోలినా, చాన్ బాషా, సిబ్బంది నాగరాజు, పవన్ సాయి, కీర్తి, పరిమళ, రమేష్‌లు పాల్గొన్నారు.



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అమ్మ ఒడి అమలు చేశారు. వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల అనే తేడా లేకుండా విద్యార్థులకు అమ్మఒడి పథకాన్ని పటిష్టంగా అమలు చేశారు. ఎలాంటి కొర్రీలు .. నిబంధనలు లేవు. పక్కాగా అమ్మఒడి అమలైంది. ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు చొప్పున తల్లుల ఖాతాలకు ఏటా తప్పకుండా చెప్పిన సమయానికి జమ చేశారు.

'అమ్మఒడి' స్థానంలో 'తల్లికి వందనం' పేరుతో ఇంటిలో ఎంతమంది విద్యార్థులుంటే అందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తాం' అని ఎన్నికల వేళ ప్రతి సభ.. సమావేశంలో చంద్రబాబు చెప్పిన మాటలివి. అయితే అధికారంలోకి వచ్చాక ఆయన మాటల గారడీ బయటపడింది. ఇప్పుడు మాట మార్చారు.. హామీ పక్కనబెట్టారు. నయవంచనకు దిగారు. ఒక్కరికే వందనం అంటూ జీఓ జారీ చేశారు. ఈ విషయం తెలిసి.. తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.. అమలు చేయనప్పుడు హామీ ఎందుకిచ్చారంటూ ప్రశ్నిస్తున్నారు.



బాబు సూపర్ 6

స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000

తల్లికి వందనం
పిల్లలకు బంధనం

- ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అన్నారు
- మేనిఫెస్టోలో చేర్చి ఊదరగొట్టారు
- అధికారంలోకి వచ్చాక ఒక్కరికే అంటున్నారు
- ఇదేం పద్ధతి బాబూ .. అంటూ తల్లిదండ్రుల మండిపాటు



తల్లుల ఉసురు తగులుతుంది

నా పేరు ఎం.మహేశ్వరి. చిన్నమండెం మండల కేంద్రంలో నివసిస్తున్నాను. నా భర్త బాలకృష్ణ ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తున్నారు. మాది చాలా పేద కుటుంబం. నా కొడుకు 2వ తరగతి, కుమార్తె 1వ తరగతి చదువుతున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలు విని తాము తమ బిడ్డలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాం. తల్లికి వందనం కింద ఇద్దరికీ కలిపి రూ.30 వేలు వస్తుందని ఆశతో చూస్తున్నాం. కానీ ఒక కుటుంబానికి చెందిన ఒక బిడ్డకే తల్లికి వందనం వర్తించేలా చంద్రబాబు జీఓ ఇచ్చారని తెలిసింది. దీంతో తాము బతుకు బండిని ఎలా లాగించాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. లేదంటే రాష్ట్రంలోని తల్లులను మోసం చేసిన ఉసురు చంద్రబాబుకు తప్పక తగులుతుంది.

రాయచోటి/రాజంపేట: పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పాఠశాలలు ప్రారంభమైన వారం పది రోజుల్లో పిల్లలను బడికి పంపే ప్రతి తల్లిఖాతాకు ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలు నగదు జమ చేసింది. ఈ నిధులతో తల్లిదండ్రులు తమ పిల్లలకు అవసరమైన విద్యాసామాగ్రిని కొనుగోలు చేసుకుని పిల్లలను సంతోషంగా బడికి పంపేవారు.

- 2024 ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో టీడీపీ ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి పోతే అంత మందికి ఒక్కొక్కరికి రూ. 15 వేలు చొప్పున అందిస్తామని ప్రకటించింది. తీరా అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ పక్కనపెట్టారు. ఒక్కరికే అంటూ తల్లికి వందనం అంటూ మాటమార్చారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెల రోజులు అవుతున్నా ఇంకా హామీ అమలు చేయకపోగా.. పూర్తి స్థాయి విధి విధానాలను త్వరలో విడుదల చేస్తామని ప్రకటించారు.

రాయచోటిలో 48,458 మంది విద్యార్థులు....

రాయచోటి నియోజకవర్గ పరిధిలో 48,458 మంది విద్యార్థులు ఇప్పటి వరకు పేర్లను నమోదు చేసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఎంతమందికి తల్లికి వందనం పథకానికి అర్హత సాధిస్తారో తెలియాలంటే కొంత కాలం వేచి చూడాల్సిందే.

రాజంపేట నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం స్కూల్‌కు వెళ్లే ప్రతి కుటుంబంలోని ఒక విద్యార్థి తల్లుల ఖాతాలో రూ.15వేల రూపాయాలు జమ చేసింది. దీంతో 2019–2023లలో నాలుగేళ్లలో 35,560 విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.141 కోట్లు విడుదల చేసి మాట నిలుపుకుంది.

రాయచోటి నియోజకవర్గంలో అమ్మ ఒడికి సంబంధించి తల్లులకు ఇచ్చిన నిధుల వివరాలు..

విద్యా సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	తల్లుల ఖాతాల్లో జమ చేసిన నగదు
2019-20	46452	రూ. 44.85 కోట్లు
2020-21	47975	రూ. 46.69 కోట్లు
2021-22	43795	రూ. 42.52 కోట్లు
2022-23	55481	రూ. 47.29 కోట్లు
మొత్తం	193793 విద్యార్థులు	రూ. 181.35 కోట్లు

తల్లికి వందనం కాదు..

తల్లికి వందనం పేరిట చిన్నపిల్లల చదువుకు సాయం అందిస్తానన్న చంద్రబాబు అధికారంలోకి రాగానే మాట తప్పారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు చదువుతూ ఉన్నా.. వారందరికీ రూ.15 వేలు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. నిజంగా తల్లికి వందనం కాదు.. తల్లికి నామం పెట్టిన చంద్రబాబు. ఇప్పుడు చంద్రబాబు మాట తప్పారని ఇప్పుడు తల్లికి వందనం కింద తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇస్తానని మాట్లాడటం రాష్ట్రంలోని ఆడబిడ్డలను మోసం చేయడమే.

– నాగేంద్రనాయక్ చౌహాన్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి

తల్లికి వందనం పథకంతో నిరాశే



ఈ చిత్రంలో తన పిల్లలతో కనిపిస్తున్న తల్లి పేరు ప్రభావతి. వెంకట సుధీర్ నాలుగవ తరగతి, భాగ్యశ్రీ రెండవ తరగతిలలో చదువుతున్నారు. వీరు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. తల్లికి తల్లికి వందనం పథకం ద్వారా ఒక ఇంట్లో పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని అప్పట్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నమ్మామని చెప్పారు. దీంతో తమ పిల్లల చదువులు భారానికి ఎంతోకొంత ఆర్థికంగా చేదోడుగా ఉంటుందని భావించామని కానీ అమలుకు ముందే తల్లికి రూ.15వేలు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి తమ ఆశలపై నీళ్లు చల్లారన్నారు. స్కూలు వారు ఫీజులు కట్టమని అడుగుతున్నారని తాము ఇప్పుడు ఎక్కడ నుంచి డబ్బులు తెచ్చేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫీజులు కట్టమని అడుగుతున్నారు



నా భర్త అమడకాయల గురుమూర్తి దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాకు ఇద్దరు పిల్లలు పెద్దబాబు 9వ తరగతి చదువుతున్నాడు. రెండవ కుమారుడు 5వ తరగతి చదువుతున్నాడు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నా అంతమందికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున ఇస్తానని నాడు ఎన్నికల సమయంలో ఇప్పటి సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. పాఠశాల యాజమాన్యం ఫీజులు కట్టమని అడుగుతున్నారు. తల్లికి వందనం డబ్బులు త్వరగా చెల్లిస్తే మా వంటి వారిని ఆదుకున్న వారు అవుతారు.

– అమడకాయల రేవతి, రాజంపేట

మోసపూరిత హామీలు మానుకోవాలి



నాకు ఇద్దరు పిల్లలు తారక్, గాయత్రి, ప్రభుత్వం తల్లికి వందనం పథకం ద్వారా సాయం చేస్తుందని ప్రభుత్వ పాఠశాలలో చదివే మా పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించాలనుకున్నాం. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి 15 వేల చొప్పున తల్లికి వందనం కింద అందిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. 30 వేల రూపాయలు వస్తుందని ఎంతో ఆశపడ్డాం. ఇప్పుడేమో ఒకరికే అంటున్నారు. మాలాంటి నిరుపేదలను ఆశ పెట్టడం చంద్రబాబుకు మంచిది కాదు. మోసపూరిత హామీలు మానుకోవాలి.

– నూతలపాటి కళ్యాణి, నందలూరు

ఆశపెట్టి మోసం చేశారు



పై చిత్రంలో పిల్లలతో కనిపిస్తున్న మహిళ పేరు ఈశ్వరమ్మ. ఈమెకు ముగ్గురు పిల్లలు. అందులో ఇద్దరు బడికి పోతున్నారు. కొడుకు ఆరో తరగతి, కుమార్తె 3వ తరగతి ప్రభుత్వ బడిలో చదువుతున్నారు. ఎన్నికలప్పుడు బడికిపోయే పిల్లలందరికీ చంద్రబాబు రూ. 15 వేలు ఇస్తామని, ఇప్పుడేమో ఒకరికే అంటున్నాడు. చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రూ. 30 వేలు వస్తుందని ఆశపడ్డా. మా వారు మూగవాడు. కూలీ పనికి పోతుంటారు. ఆరోగ్యం బాగలేనప్పుడు పూట గడవక పోతే డబ్బుతో గడుపుకోవచ్చనుకున్నా. అయితే ఇప్పుడు చంద్రబాబు నిరుపేదలకు ఆశపెట్టి మోసం చేయడం న్యాయం కాదు. ఇచ్చిన హామీకి కట్టుబడి పిల్లల చదువుకు బాధ్యత తీసుకోవాలి.

వందనం పేరిట వంచనకు గురయ్యాం



నా భర్త నరేష్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాకు ఇద్దరు పిల్లలున్నారు. చంద్రబాబు ఈ సారైనా ఇచ్చిన మాటకు కట్టుబడి హామీ తమ బతుకులు మారుతాయని విశ్వసించామం. కానీ ప్రభుత్వం ఏర్పడ్డ నెలలోపే విద్యార్థుల తల్లులకు అన్యాయం చేసేలా నిర్ణయం తీసుకున్నారు. నాకు ఇద్దరు పిల్లలు వారి చదువులకు బాబు తల్లికి వందనం కింద ఇచ్చే డబ్బును వాడుకుందామని ఆశపడ్డాం. కానీ ఇలా నమ్మించి మాట తప్పడంతో మాలాంటి వారికి నరకయాతన తప్పదు. విద్యార్థులు, పేద కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అందరి పిల్లలకు రూ.15వేలు చెల్లించాలి.

– కాటమ్మ, దేవపట్ల, సంబేపల్లె

పిల్లలను ఎలా చదివించుకోవాలి



నాకు ఐదుగురు సంతానం. వారిలో ప్రస్తుతం ముగ్గురు చదువుతున్నారు. నా భర్త కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చంద్రబాబు ఇచ్చిన తల్లికి వందనం పథకానికి మేము ఎంతో ఆకర్షితులమైయ్యాం. ఆ పథకం అమలైతే పిల్లల చదువుకు ఇబ్బందులు తగ్గుతాయని ఆనందంలో ఉంటిమి. చంద్రబాబు రాయచోటి ఎన్నికల సభలోనూ ఈ పథకం గురించి చెబితే కచ్చితంగా చేస్తారని భావించాం. తీరా ప్రభుత్వంలోకి వచ్చాక తల్లికి ఒక్కరికి రూ.15వేలు వేస్తామనడం ఎంత వరకు న్యాయం. తల్లికి వందనం అమలు కాకపోతే మా బతుకులు నాశనమైతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

– తిరుపీదుల దేవకి, లక్కిరెడ్డిపల్లె మండలం

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయండి

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడులో ఉన్న ఆకేపాటి ఎస్టేట్‌లో శుక్రవారం నియోజకవర్గంలోని జెడ్పీటీసీలతో ఎమ్మెల్యే ఆకేపాటి సమావేశమయ్యారు. నియోకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్క జెడ్పీటీసీ నిరంతరం కృషి చేయాలని కోరారు. గ్రామ స్థాయిలో సైతం సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో ఎస్టేట్‌కు విచ్చేసి వారి సమస్యలు ఏకరవు పెట్టారు. వారి సమస్యలు ఆశాంతం విని వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వారికి భోజనం స్వయంగా అందజేశారు.

ఆలయానికి కలశం వితరణ

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మాతమ్మతల్లి ఆలయానికి ప్రత్యేకంగా కలశం తయారు చేయించి వితరణ చేశారు. మండల పరిధిలోని ఆకేపాడు పంచాయతీలోని పెద్దూరు దళితవాడలో శుక్రవారం శ్రీమాతమ్మతల్లికి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి ముందుగా మాతమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన సోదరుడితో కలిసి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.




ఆలయానికి కలశం వితరణ చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, ఆయన సోదరుడు అనిల్‌కుమార్‌రెడ్డి

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

సిద్దవటం : రైతు సేవా కేంద్రం సహాయకులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం మండలానికి చెందిన 10 రైతు సేవా కేంద్ర సహాయకులకు ఖరీఫ్, 24 సీజన్ సమయాత్తంపై శిక్షణ, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సేవా కేంద్రం సహాయకులు రైతు భరోసా కేంద్రం రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహిస్తూ, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలపై చీడ, పీడలను గుర్తించి రైతులకు సస్యరక్షణ చర్యలు సూచించాలన్నారు. రైతులకు అవసరమైన సలహాలను అందిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి పనిచేసే రైతుల సంఖ్య, పంటల విస్తీర్ణం పెంచాలని తెలియజేశామన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని రైతు సేవా కేంద్ర సహాయకులకు సూచించామని వ్యవసాయాధికారి తెలిపారు. కార్యక్రమంలో 10 మంది రైతు కేంద్ర సహాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : రాయచోటిలో ఈనెల 14న నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎంఏ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఎస్.నహవీల్‌బాషా, లైఫ్‌కేర్ క్లినిక్ వైద్యుడు జక్రియా అహమ్మద్, మాజీ ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎస్.కె.హుస్సేన్‌లు కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతంలోని బడీ కరిమియా మసీదు ఆవరణలో ఎంఏ వెల్ఫేర్ సొసైటీ, లైఫ్‌కేర్ క్లినిక్, షిఫా ఆసుపత్రిల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహింపబడుతుందన్నారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం వరకు శిబిరంలో రోగులకు చికిత్సలు అందిస్తామన్నారు. శిబిరంలో పలు విభాగాలకు చెందిన స్పెషలిస్టు డాక్టర్లచే రోగులకు వైద్య సేవలు అందించబడతాయన్నారు. వైద్యపరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా ఎంఏ వెల్ఫేర్ సొసైటీ తరపున మందులను అందచేయడం జరుగుతుందన్నారు. రోగులు వైద్యశిబిరానికి హాజరై వైద్య సేవలను పొందాలంటూ కోరారు.



మాట్లాడుతున్న ఎంఏ వెల్ఫేర్ సొసైటీ జనరల్ సెక్రటరీ ఎస్.నహవీల్‌బాషా


భక్తి శ్రద్ధలతో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు

రాయచోటి టౌన్ : పట్టణంలో శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో కొలువైన భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణయ్య స్వామి, వేదపండితులు రాచరాయ యోగి స్వామి వారి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. పూజలలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు ప్రత్యేక దర్శన ఏర్పాటు చేశారు. అలాగే అర్చకులు భక్తులకు రాహుకాల పూజ విశిష్టతను వివరించారు.

సన్మానం



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

రామాపురం : విజయవాడ లెనిన్ సెంటర్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సాంఘిక సంక్షేమ గురుకులాల (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం గురువారం జనరల్ బాడీ నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ ఎన్నిక ప్రక్రియ జరిపారు. మండలంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పి.వెంకట్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆయనకు కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ వరప్రసాద్, పాఠశాల యాజమాన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌కు ఘనంగా సన్మానించి అభినందించారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టండి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు రాహుల్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. శుక్రవారం ఆయన మున్సిపల్ అధికారులతో కలసి పట్టణంలోని కొత్తపేట, ప్రకాష్‌నగర్‌కాలనీ, బేతల్‌కాలనీలలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. ప్రకాష్‌నగర్‌లోని మురుగునీటి కుంటతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆ ప్రాంతీయులు సోషల్‌మీడియాలో రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో స్పందించిన మున్సిపల్ అధికారులు, రాహుల్‌రెడ్డితో కలసి శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్య పరిష్కారం కోసం ఆ ప్రాంతంలో 100 మీటర్ల మురుగునీటి కాలువను నిర్మించాలని నిర్ణయించి, ఆ మేరకు ప్రణాళికలు తయారు చేయాలంటూ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బేతల్‌కాలనీలోని దివ్యతేజ స్కూల్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభంతో ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన రాహుల్‌రెడ్డి వెంటనే ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ స్తంభాన్ని పక్కకు మార్చాలంటూ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, సచివాలయం అధికారులు శివాజీ, రమేష్‌రెడ్డితోపాటు ఆయా ప్రాంతాల నేతలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిద్దవటం : గ్రామ పంచాయతీ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాధవరం-1 గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్య తెలిపారు. సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో సర్పంచ్ జానకిరామయ్య ఆధ్వర్యంలో ఫ్రైడే – డ్రైడే సందర్భంగా పారిశుధ్య పనులను చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి లక్ష్మినరసయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడిచెత్తను, పొడిచెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్‌ల వాహనంలో వేయాలన్నారు. మాధవరం-1 లోని కడప చెన్నై ప్రధాన రహదారికి ఇరువైపుల కాలువల్లో ఉన్న పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. దుకాణాదారులు ప్లాస్టిక్ వాడరాదని చెత్త కాలువల్లో వేయరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఉమాదేవి, హరిత రాయబారులు పాల్గొన్నారు.

డెంగీ, డయేరియాపై అవగాహన ఉండాలి

సంబేపల్లె : డెంగీ, డయేరియాపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్ తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు సందర్భంగా పెద్ద జంగంపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు, పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవడమే కాక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వ ఉంచిన ప్రాంతాలలో లార్వా ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. వేడి నీటిని తాగాలన్నారు. జ్వరం, ఒంటి నొప్పులు ఉన్నట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. దోమల నుంచి రక్షించుకోవడానికి దోమతెరలు వాడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు చక్రపాణి, హెల్త్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ తెలియజేశారు. స్థానిక డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేటలోని 220 కెవిఎస్‌ఎస్, కోడూరు 33 కెవి, 11 కెవి, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం శనివారం చేపడుతున్నామన్నారు. రాజంపేట పట్టణంతోపాటు మండలంలోని తాళ్లపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లి, కట్టకిందపల్లి, బావికాడపల్లి, కొండ్లోపల్లి, హెచ్.చెర్లోపల్లి, మందరం.. పుల్లంపేట మండలంలోని పీవీజీ పల్లి, దొండ్లోపల్లి, వత్తలూరు, రెడ్డిపల్లి, పెనగలూరు, బెస్తపల్లి, కొండూరు, తిమ్మాయిగారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు వారు చెప్పారు.

రామాపురం : విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వరప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.